క్లుప్తంగా

బీజేపీ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న మదన్‌మోహన్

రాయికల్: రానున్న ఎన్నికల దృష్ట్యా బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ చిలకమర్రి మదన్‌మోహన్ కోరారు. ఈ మేరకు శనివారం మండలంలోని అయోధ్య గ్రామంలో స్ట్రీట్‌కార్నర్ సమావేశం నిర్వహించారు. కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మదన్‌మోహన్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలిసేలా బీజేపీ కార్యకర్తలు తీసుకెళ్లాలని సూచించారు. బీజేజీ ఆధ్వర్యంలో శక్తి కేంద్రాల వారీగా అన్ని గ్రామాల్లో స్ట్రీట్‌కార్నర్ సభలు నిర్వహిస్తున్నామని, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు అన్నవేని వేణు, ప్రధాన కార్యదర్శి తిప్పరెడ్డి రాజశేఖర్, రాష్ట్ర నాయకులు లక్ష్మీనారాయణ, యువమోర్చా అధ్యక్షుడు రాజనాల మధు, మండల నాయకులు పడాల తిరుపతిరెడ్డి, పసునూరి శ్రీనివాస్, రవీందర్, రాజేశ్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



సాయం అందిస్తున్న జెడ్పీటీసీ రాజేందర్‌రావు

పెగడపల్లి: మండలంలోని రాజరాంపల్లిలో ఇటీవల పూరిళ్లు దగ్ధమై ఆర్థికంగా నష్టపోయిన కుటుంబానికి జెడ్పీటీసీ ఆర్థికసాయం అందజేశారు. గ్రామానికి చెందిన బండారి పెద్ద కనుకయ్య కుటుంబం నివాసం ఉంటున్న పూరిళ్లు 5న గ్యాస్ సిలిండర్ పేలి దగ్ధమైంది. ఈ మేరకు శనివారం జెడ్పీటీసీ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేలు అందజేశారు. సర్పంచ్ సత్తమ్మ, ఎంపీటీసీ రవి, ఉప సర్పంచ్ రాజశేఖర్‌గౌడ్, నాయకులు రవి, గంగాధర్‌గౌడ్, మల్లేశం ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న వెంకటేశ్వర్‌రావు

కథలాపూర్: మండలంలోని దూలూర్ గ్రామంలో శ్రీఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి స్థానికుడైన మిర్యాల వెంకటేశ్వర్‌రావు రూ.20,116 విరాళంగా శనివారం అందించారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులకు డబ్బులు అందజేశారు. సింగిల్‌విండో డైరెక్టర్ గుండారపు గంగాధర్, జిల్లా లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం



మందులు పంపిణీ చేస్తున్న చైర్మన్ రాజేశ్

ధర్మపురి: మండలంలోని కోస్నూర్‌పల్లె గ్రామంలో శనివారం ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అయ్యోరి రాజేశ్ ఆధ్వర్యంలో వెటర్నరీ శాఖ వారి సహకారంతో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో సుమారు 250 ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు తదితర వాటికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎన్నం లక్ష్మారెడ్డి, పాలకవర్గ సభ్యులు సొల్ల నరేశ్, పశు వైద్యాధికారి రాజేందర్‌రెడ్డి, ఇన్‌చార్జి కార్యదర్శి వరలక్ష్మి తదితరులు ఉన్నారు.

ఆర్థిక చేయూత



నగదు అందజేస్తున్న యువత

మేడిపెల్లి: మండలంలోని పోరుమల్ల గ్రామానికి చెందిన ఒడ్నాల లక్ష్మణ్ అనే యువకుడు ఇటీవల గుండెపోటుతో చనిపోయాడు. కాగా శనివారం లక్ష్మణ్ స్నేహితులు రూ.65వేలు అతడి కుటుంబ సభ్యులకు అందజేశారు. అలాగే హిందూసేన తరఫున రూ.75వేలు లక్ష్మణ్ కూతురు పేరుపై బ్యాంక్‌లో డిపాజిట్ చేసినట్లు సర్పంచ్ తిరుపతిరెడ్డి తెలిపారు. వేణు, మమత, రజిత, సాయి కుమార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సండే స్పెషల్

ఉత్తమ కార్టూనిస్ట్




పరమేశ్వర్..

విశ్వకర్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరమేశ్వర్‌కు సన్మానం

- మూఢనమ్మకాలు, కరోనా, మద్యపానం కార్టూన్లతో గుర్తింపు
- అనేక బహుమతులు, పురస్కారాలు
- సామాజిక కోణంలో కార్టూన్లు వేయడమే ఆయన ప్రత్యేకత

కోరుట్లరూరల్: చదువుకునే రోజుల్లోనే ఆయన కార్టూన్లపై మక్కువ పెంచుకున్నారు. పాఠశాల రోజుల్లోనే చిన్న చిన్న కార్టూన్లు వేస్తూ ఉపాధ్యాయుల మన్ననలు పొందాడు. అదే హాబీగా చేసుకొని కార్టూన్లు వేస్తుండేవాడు. డిగ్రీ తర్వాత పైచదువులకు వెళ్లలేక కిరాణ వ్యాపారంలో స్థిరపడ్డాడు. వ్యాపారం చేస్తూనే కార్టూన్లపై మక్కువతో తన ప్రవృత్తిని కొనసాగిస్తున్నాడు కోరుట్ల మండలం గుమ్లాపూర్ గ్రామానికి చెందిన ఊసకోల పరమేశ్వర్. 1993లో మొట్ట మొదటిసారిగా మయూరి వార పత్రికకు వేసిన కార్టూనుకు ప్రశంసాపత్రం లభించింది. అప్పటి నుంచి పలు వార, మాస పత్రికలకు కార్టూన్లు వేస్తూ పలు జాతీయ, అంతర్జాతీయ పోటీలకు కార్టూన్లు పంపుతూ పురస్కారాలు, ప్రశంసలు అందుకున్నాడు.

పురస్కారాలు, బహుమతి..



పరమేశ్వర్ వేసిన కార్టూన్

పరమేశ్వర్ వేలకొలది కార్టూన్లు వేసి ప్రశంసలు పొందారు. ముఖ్యంగా హరితహారం, కరోనా, మూఢనమ్మకాల నిర్మూలన, ఓటుకు నోటు, మద్యపానం వంటి కార్టూన్లు గుర్తింపు తెచ్చాయి. 2020 ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లాలో భారత్ టాలెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్టూన్ పోటీల్లో కరోనా మహమ్మారిపై వేసిన కార్టూన్ మొదటి బహుమతి గెలుచుకోగా ఉత్తమ కార్టూనిస్టుగా ప్రశంస అందుకున్నారు. కెనడాలో తెలుగు తల్లి మాసపత్రిక ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో హరితహారంపై పరమేశ్వర్ వేసిన కార్టూన్ మొదటి బహుమతి గెలుచుకోగా ప్రశంసాపత్రం, నగదు పురస్కారం లభించింది. మూఢ నమ్మకాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో పరమేశ్వర్ కార్టూన్‌కు ద్వితీయ స్థానం లభించింది.

ప్రపంచ తెలుగు మహాసభల్లో..

2017లో హైదరాబాద్‌లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల్లో నిర్వహించిన ఫొటో ఎగ్జిబిషన్‌లో పరమేశ్వర్ చెట్ల పెంపకంపై వేసిన కార్టూన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచి రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ చైర్మన్ ద్వారా ప్రశంసా పత్రం అందుకున్నారు. 2020లో సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా హరితహారంపై వేసిన కార్టూన్ బహుమతి గెలుచుకుంది. ప్రస్తుతం కోరుట్ల బస్టాండ్‌లో కిరాణ షాపు నిర్వహిస్తున్న పరమేశ్వర్ వీలు దొరికినప్పుడు సమాజ హితం కోరే కార్టూన్లు వేస్తూ మన్ననలు పొందుతున్నాడు.



సమాజ హితం కోసమే



కార్టూన్లు వేయటం హాబీగా ఎంచుకున్న. నేను వేసే కార్టూన్లు సమాజ హితం కోసమే. కార్టూన్ల ద్వారా సమాజ పరిస్థితులను కళ్ల ముందుంచే ప్రయత్నం చేస్తున్న.

– ఊసకోల పరమేశ్వర్

అటెన్షన్ ప్లీజ్



రోడ్డు గుంతలమయం

మేడిపెల్లి: మండలంలోని వల్లంపల్లి నుంచి మన్నెగూడెం వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు మూడు కిలోమీటర్ల మేర చాలా వరకు గుంతలు పడటంతో రాత్రిపూట ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే వాహనదారులు భయపడుతున్నారు. వెంటనే రోడ్డు వేయడమో లేదా గుంతలు పూడ్చడమో వాహనదారులు, ప్రజలు చేయాలని కోరుతున్నారు.

సంప్రదించాల్సిన అధికారి పేరు : విజయ్, పంచాయతీరాజ్ ఏఈ, మేడిపెల్లి
ఫోన్ నంబర్ 90009 66075

కార్నర్ మీటింగ్ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కోరుట్ల: పట్టణంలో ఆదివారం నిర్వహించే ప్రజాగోస బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్‌ను విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు జేఎన్ వెంకట్, సురభి నవీన్ కుమార్, చెట్లపల్లి సుఖేందర్ కోరారు. ఈ మేరకు శనివారం కోరుట్లలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మీటింగ్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ హాజరవుతారని తెలిపారు. పట్టణంలోని ఝాన్సీరోడ్ శక్తి కేంద్ర ప్రధాన కూడలిలో మీటింగ్ ఉంటుందన్నారు. బీజేపీ శ్రేణులు, అభిమానులు, తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి పోతుగంటి శ్రీనివాస్, కౌన్సిలర్ మాడవేణి నరేశ్, నాయకులు రాజమురళి, టీవీ శేఖర్ పాల్గొన్నారు.

దీన్‌దయాళ్ వర్ధంతి..

పండిట్ దీన్‌దయాళ్ వర్ధంతి సందర్భంగా పట్టణ శివారులోని సాయిబాబా ఆలయ సమీపంలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సురభి నవీన్‌కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి పోతుగంటి శ్రీనివాస్ గౌడ్, రాజమురళి తదితరులు పాల్గొన్నారు.

జాతరలో పోలీస్ కళాబృందాల ప్రదర్శన



అవగాహన కల్పిస్తున్న పోలీస్ కళా బృందం

సారంగాపూర్: ఏ సమస్య వచ్చినా తమకు ఫోన్ చేయాలని పోలీస్ కళాబృందాలు, షీటీమ్స్ పిలుపునిచ్చాయి. ఈ మేరకు శనివారం బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాల్లో ఎస్పీ భాస్కర్ ఆదేశాలతో కళాబృందాలు ఆత్మహత్యల నివారణ, షీటీమ్స్, డయల్ 100 తదితర కార్యక్రమాలపై పోలీసులు అందిస్తున్న సేవలు వివరించారు. సైబర్ నేరాల నియంత్రణ, సైబర్‌నేరాల ఉచ్చులో పడకుండా ఎలా ఉండాలి, ట్రాఫిక్ నియమాలు తదితర అంశాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై అజయ్, ఏఎస్సై వలీబేగ్, పోలీసులు, కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

మహారాష్ట్రకు వెళ్లిన జిల్లా రైతులు

- కర్బూజ సాగు పరిశీలన



కర్బూజ సాగు పరిశీలనలో రైతులు

సారంగాపూర్: కర్బూజ సాగులో అధిక దిగుబడులు సాధిస్తున్న మహారాష్ట్ర రైతుల వ్యవసాయ క్షేత్రాలను సందర్శించడానికి జిల్లాలోని రైతులు అక్కడి రైతుల ద్వారా సాగు మెలకువలు నేర్చుకోవడానికి శనివారం వెళ్లి వారి పంటలను పరిశీలించారు. జిల్లాలోని సారంగాపూర్ మండలం పెంబట్ల గ్రామానికి చెందిన బండారి వెంకటేశ్‌తో పాటు, మల్లాపూర్ మండలం సిర్‌పూర్ గ్రామ రైతు పోగుల నరేశ్, ముత్యంపేట గ్రామ రైతు మర్రిపల్లి శ్రీనివాస్, కోరుట్ల మండలం ధర్మారం రైతు కడతాల రాజు వెళ్లారు. మహారాష్ట్రలోని పటాస్ బోరి ప్రాంతంలోని జ్ఞానేశ్వర్ 50 ఎకరాల్లో కర్బూజ సాగుచేస్తున్నాడు. ఐదేళ్లుగా ఈ పంటలను సాగుచేసి సత్ఫలితాలు పొందుతుండడంతో జ్ఞానేశ్వర్‌తో ఫేస్‌బుక్‌లో పరిచయం పెంచుకున్న జిల్లా రైతులు జ్ఞానేశ్వర్, అక్కడ వ్యవసాయాధికారుల ఆహ్వానం మేరకు పటాస్‌బోరిలో పైన నలుపు ఉండి లోపల ఎరుపు ఉండే కర్బూజ సాగును పరిశీలించారు. ఇక్కడి రైతులు ఎకరాకు 35 టన్నుల దిగుబడి సాధిస్తున్నారని వారు తెలిపారు.

వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలి



మాట్లాడుతున్న వడ్డెర సంఘం నాయకులు

మల్లాపూర్: వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ శనివారం హైదరాబాద్‌లో అసెంబ్లీ ముట్టడికి తరలిన నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి బేగంపేట పోలీస్‌స్టేషన్‌కి తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వడ్డెరులలో 80శాతం ప్రజలు నిరుపేదలుగా ఉన్నారని, కొన్ని రాష్ట్రాల్లో ఎస్టీలుగా, మరికొన్ని చోట్ల బీసీలుగా రిజర్వేషన్లు అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో వడ్డెరులను బీసీ నుంచి తొలగించి ఎస్టీ జాబితాలో చేర్చేలా అసెంబ్లీ తీర్మానం చేసి పంపాలని డిమాండ్ చేశారు. వడ్డెర నాయకులు ఓర్సు శ్రీనివాస రాజు, తోనేశ్వర్, బోసు రాము పాల్గొన్నారు.

మల్లన్న జాతర ఉత్సవాలు ప్రారంభం



ఒగ్గు కళాకారుల నృత్యాలు

కోరుట్ల: పట్టణంలోని భీముని దుబ్బమల్లన్న స్వామి జాతర ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారి పల్లకి సేవను ప్రధాన వీధుల్లో నిర్వహించారు. ఒగ్గు కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆదివారం జాతర జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

‘పర్యటనల పేరిట రాజకీయాలు చేస్తున్నారు’



మాట్లాడుతున్న ముఖేష్ ఖన్నా

జగిత్యాలటౌన్: పార్లమెంట్ సెషన్ నడుస్తుండగా నియోజకవర్గ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధికి కృషి చేయాల్సిన నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ పర్యటనల పేరిట రాజకీయాలు చేస్తున్నారని, పరామర్శల పేరుతో జగిత్యాలలో పర్యటిస్తూ ఇక్కడి ప్రశాంతతను చెడగొట్టేలా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ యూత్ నాయకుడు బాజోజి ముఖేష్‌ఖన్నా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం జగిత్యాల ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. పరామర్శల పేరిట జగిత్యాల పర్యటనకు వచ్చిన ప్రతీసారి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌తో పాటు కవితక్కను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. రైతులకు బాండ్ పేపర్ రాసిచ్చి మోసం చేసిన ఘనుడు అరవింద్ అని గుర్తుచేశారు. పసుపు పంటకు సరైన ధర రాక ఇబ్బంది పడుతున్న రైతులకు అండగా నిలవాల్సిన ఎంపీ రాజకీయాలు చేయడం తగదని హితవు పలికారు. ఆయన వెంట బీసీ నాయకులు పులి నర్సయ్య, సుంకె మహేశ్ ఉన్నారు.

విగ్రహావిష్కరణ విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కోరుట్ల: ఇబ్రహీంపట్నం మండలంలోని వర్షకొండలో ఈ నెల 19న జరిగే ఛత్రపతి సాహు మహరాజ్ విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలని ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పేట భాస్కర్ కోరారు. ఈ మేరకు ఆదివారం కోరుట్లలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ విగ్రహావిష్కరణను బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చేయనున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ కోరుట్ల ఇన్‌చార్జి గుజ్జరి ప్రకాష్, టీవైఎస్ జిల్లా ఉపాధ్యక్షుడె ఎస్.రాజయ్య, బీఎస్పీ కథలాపూర్, ఇబ్రహీంపట్నం మండలాధ్యక్షులు తెడ్డు శేఖర్, బొబ్బిలి కిషోర్, నాయకులు బోయిని వెంకటేశ్, తాండ్ర సిద్దార్థ, అజయ్, నర్సయ్య, ఎర్ర శంకర్, మకిలి విజయ్, స్వేరో ఎర్ర రాకేశ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజా గోస–బీజేపీ భరోసా’



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మేడిపెల్లి: మండలంలోని పోరుమల్ల గ్రామంలో ప్రజా గోస–బీజేపీ భరోసా శక్తి కేంద్రం కార్నర్ సభ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, రాష్ట్రంలోని కుటుంబ పాలన ఆగడాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ముంజ శ్రీనివాస్, తిరుపతి, క్యాతం దశరథరెడ్డి పాల్గొన్నారు.

అంబేడ్కర్ యువజన సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నరేశ్



మల్లాపూర్: అంబేడ్కర్ యువజన సంఘం మండల ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కోరుట్ల నరేశ్‌ను నియమించినట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర రమేశ్, మండల అధ్యక్షుడు పెద్దిరెడ్డి లక్ష్మణ్ తెలిపారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూలే, అంబేడ్కర్ ఆశయ సాధనే లక్ష్యంగా బడుగు, బలహీన వర్గాల ఐక్యతకు కృషి చేస్తూ మహనీయులు కలలుగన్న సామాజిక సమానత్వం కోసం అహర్నిశలు పనిచేయాలని సూచించారు.

ఆడదూడలకు ఉచితంగా బ్రూసెల్లోసిస్ టీకా

జగిత్యాలఅగ్రికల్చర్: ఆడదూడల వృద్ధిని పెంచేందుకు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా బ్రూసెల్లోసిస్ టీకా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో రైతులకు చెందిన ఆడ దూడలకు వెటర్నరీ లైవ్ స్టాక్ అసిస్టెంట్ కందుకూరి పూర్ణ చందర్ ఆధ్వర్యంలో పశు వైద్య సిబ్బంది టీకా వేశారు. సర్పంచ్ చెరుకు జాన్, ఆఫీస్ సబార్డినేట్ రాజు, రైతు నాయకులు ఎడమల సత్యం, ఏలేటి రాజిరెడ్డి పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

కథలాపూర్: ఈనెల 19న ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండలో రిజర్వేషన్ల పితామహుడు ఛత్రపతి సాహు మహరాజ్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ప్రజలు తరలిరావాలని బీఎస్పీ నాయకులు కోరారు. కథలాపూర్‌లో బీఎస్పీ నాయకులు శనివారం విగ్రహావిష్కరణ కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. బీఎస్పీ మండల కన్వీనర్ తెడ్డు శేఖర్, నాయకులు బాలె నీలకంఠం, చాకలి వెంకటేశ్, వికాశ్, వర్ధన్, వెంకట్, నర్సయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆత్మహత్యకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మెట్‌పల్లి: జగిత్యాలరూరల్ మండలంలోని నర్సింగపూర్‌కు చెందిన రైతు జలపతిరెడ్డి, ఆయన ఇద్దరు కూతుళ్ల ఆత్మహత్యకు కారకుడైన దామోదర్‌రావుపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డివిజన్ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో శనివారం ఎస్సై శ్యామ్ రాజ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. అలాగే మృతుడి కుటుంబానికి ప్రభుత్వం రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వడంతో పాటు ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బద్దం శ్రీనివాస్‌రెడ్డి, పన్నాల మాధవ్‌రెడ్డి, అనిల్, సంతోష్‌రెడ్డి, రాంచందర్‌రెడ్డి, తిరుపతి, రత్నాకర్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని శిక్షించాలి

కథలాపూర్: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌ను కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఆమెట రాజేశ్ డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమం కోసం రాజ్యాంగం రాసిన మహనీయుడిపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడం దారుణమన్నారు.

✦ వైద్య శిబిరానికి స్పందన

కోరుట్ల: పట్టణంలోని శివసాయి ఆసుపత్రిలో 20వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. కరీంనగర్‌కు చెందిన అపోలో హాస్పిటల్ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు బోగ శంకర్, బోగ శ్రీలత, కేవీ హరీశ్, సురేశ్‌గౌడ్, వాసుదేవారెడ్డి, సుబ్రర్ సోరెన్ పాల్గొన్నారు.

✦ దిష్టిబొమ్మ దహనం

మేడిపెల్లి: బాబాసాహెబ్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌పై రాజద్రోహం పెట్టి పీడీయాక్ట్ నమోదు చేయాలని మేడిపెల్లి బహుజన ఐక్యవేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో హమారా ప్రసాద్ దిష్టిబొమ్మ దహనం చేశారు. బహుజన ఐక్యవేదిక మేడిపెల్లి, భీమారం అధ్యక్షులు ఎర్రాల రాజేశ్, చిట్యాల అన్వేష్, ఎంపీటీసీ దాసు, డప్పుసాగర్, సురేశ్, దిలీప్ పాల్గొన్నారు.

✦ ఎమ్మెల్సీ పరామర్శ

వెల్గటూర్: ఎండపల్లి మండల కేంద్రానికి చెందిన ఎంపీటీసీ, బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎండీ బషీర్ తండ్రి ఎండీ నాసర్ గత ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. కాగా శనివారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, జగిత్యాల డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి వారి ఇంటికి వెళ్లి ఎండీ నాసర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. బషీర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పొలాలకు సాగునీరు అందించాలి



పొలాల వద్ద కాంగ్రెస్ నాయకులు

మల్యాల: వరిపొలాలకు సాగు నీరందక ఎండుతున్నాయని, నారాయణపూర్ రిజర్వాయర్ కట్ట మరమ్మతు పనులు తక్షణమే చేపట్టాలని కాంగ్రెస్ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని బల్వంతాపూర్ గ్రామంలోని వరి పొలాలను శనివారం ఆయన స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. కాంగ్రెస్ దారం ఆదిరెడ్డి, బూర్గు గంగన్న, కోను లక్ష్మణ్, ముత్యం శంకర్, కంచర్ల లక్ష్మణాచారి, శనిగరపు తిరుపతి పాల్గొన్నారు.